epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 44 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 11 జనవరి 2026 | పేజీలు : 05



హుస్నాబాద్ కరీంనగర్‌లో ఉండాలనేది ప్రజల ఆకాంక్ష

2

# టూరిజం ప్లాజాలో..

# ఏం జరుగుతోంది?

2

- లాభాలు తెచ్చిన అధికారికి బదిలీ
- కోట్ల బకాయిలున్న వ్యక్తికే మళ్లీ కీలక బాధ్యతలు!
- వెనుక ఉన్నతాధికారుల వాటాలే కారణమా?




తెలంగాణ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆదాయానికి ప్రధాన వనరుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు నుంచి టీజీటిడీసీ ఎండీ వల్లూరి క్రాంతి వరకు పర్యాటక శాఖను లాభాల బాట పట్టించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వేళ, అదే శాఖలోని కొందరు అధికారులు మాత్రం సంస్థను అవినీతి కూపంగా మార్చుతున్నారనే తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే టూరిజం రవాణా విభాగం, ప్రధాన కార్యాలయంలో కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన భారీ కుంభకోణాలు బయటపడి, పోలీసు కేసులు, అరెస్టులు, సస్పెన్షన్లు జరిగాయి. అయినా పాఠం నేర్చుకోని కొందరు అధికారులు కొత్త మార్గాల్లో నిధుల దోపిడీకి తెరలేపుతున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అవినీతి బాగోతం పై 'మన చౌరాస్తా' అందిస్తున్న ప్రత్యేక కథనం..

- మన చౌరాస్తా, ప్రత్యేక ప్రతినిధి



## విద్యాభివృద్ధికి కృషి చేస్తాం..

- వరంగల్ ఎంపీ కడియం కావ్య

5లో

## జర్నలిస్టులకు అండగా ఉంటాం

- అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారం వాస్తవం కాదు
- గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ల మంజూరు
- ఏకార్డుకైనా అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయి
- జర్నలిస్టు సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం
- జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తాం..
- మంత్రి పొంగులేటి మీటింగ్



3లో

# టూరిజం ప్లాజాలో ఏం జరుగుతోంది?

- లాభాలు తెచ్చిన అధికారికి బదిలీ
- కోట్ల బకాయిలున్న వ్యక్తికే మళ్లీ కీలక బాధ్యతలు!
- వెనుక ఉన్నతాధికారుల వాటాలే కారణమా?



**మన చౌరాస్తా, ప్రత్యేక ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆదాయానికి ప్రధాన వనరుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మంత్రి జూపల్లి కృష్ణారావు నుంచి టీజీటిడీసీ ఎండీ వల్లూరి క్రాంతి వరకు పర్యాటక శాఖను లాభాల బాట పట్టించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వేళ, అదే శాఖలోని కొందరు అధికారులు మాత్రం సంస్థను అవినీతి కూపంగా మార్చుతున్నారనే తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే టూరిజం రవాణా విభాగం, ప్రధాన కార్యాలయంలో కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల్లో జరిగిన భారీ కుంభకోణాలు బయటపడి, పోలీసు కేసులు, అరెస్టులు, సస్పెన్షన్లు జరిగాయి. అయినా పాఠం నేర్చుకోని కొందరు అధికారులు కొత్త మార్గాల్లో నిధుల దోపిడీకి తెరలేపుతున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అవినీతి బాగోతంపై 'మన చౌరాస్తా' అందిస్తున్న ప్రత్యేక కథనం..

**అక్రమాల కేంద్రంగా మారిందా?**

బేగంపేట్‌లోని టూరిజం ప్లాజా టల్ హోటల్‌లో ఇటీవల బయటపడిన ఆర్థిక అవకతవకలు శాఖ ప్రతిష్ఠకే మచ్చ తెస్తున్నాయి. తారమతిలో విధులు నిర్వహించాల్సిన సామియల్ అనే తాత్కాలిక ఉద్యోగి, ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే టూరిజం ప్లాజా టల్‌లో కీలక బాధ్యతలు చేపట్టినట్టు తెలుస్తోంది. వినియోగదారుల నుంచి వచ్చే ఆదాయాన్ని సంస్థ ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత అతనిదే. అయితే నెలకు సగటున రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు వ్యాపారం జరిగినప్పటికీ, సంస్థకు చెల్లించాల్సిన దాదాపు రూ.70 లక్షలు బకాయిగా మిగిలిపోయాయి. ఈ నిధులు ఎక్కడికి వెళ్లాయి? ఎవరి అనుమతితో ఈ వ్యవహారం సాగింది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు.

**బకాయిలు.. బదిలీ.. అయినా మళ్లీ ఎంట్రీ!**

ఈ అవకతవకలపై స్పందించిన టీజీటిడీసీ ఎండీ, 2023 మే 9న సామియల్‌ను టల్ నుంచి బదిలీ చేశారు. అతని స్థానంలో ప్రసాద్‌రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత టూరిజం ప్లాజా టల్ హోటల్ వ్యాపారం అసాధారణంగా పెరిగింది. కేవలం మూడు నెలల్లోనే రూ.2.3 కోట్లు, రూ.3.6 కోట్లు, రూ.5.5 కోట్ల వ్యాపారం జరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. అంటే గతంతో పోలిస్తే 600 శాతం వృద్ధి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. వ్యాపారం నష్టాల్లో ఉన్నప్పుడు ఉన్న వ్యక్తిని తొలగించారు. లాభాల్లోకి తీసుకొచ్చిన అధికారిని బదిలీ చేశారు. కోట్ల బకాయిలు మిగిల్చిన వ్యక్తికే మళ్లీ బాధ్యతలు అప్పగించారు.

**పరిపాలనా నిర్ణయమా? లేక ఒత్తిళ్లా?**

సామియల్‌పై ఉన్న ఆరోపణలు మాటల వరకే పరిమితం కావు. సంస్థకు చెల్లించాల్సిన రూ.18,66,693ను అతని జీతం నుంచి నెలకు రూ.15 వేలు చొప్పున రికవరీ చేయాలని 2024 ఆగస్టు 30న అధికారికంగా నోటీసులు కూడా జారీ అయ్యాయి. అయితే ఇలాంటి వ్యక్తికి తాజాగా జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించి, మళ్లీ టూరిజం ప్లాజా టల్ హోటల్ బాధ్యతలు అప్పగించడమే ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. నిధుల విషయంలో నోటీసులు పొందిన వ్యక్తిని ప్రమోట్ చేయడం వెనుక కారణమేంటి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**ఉన్నతాధికారులకు వాటాల కోసమేనా..?**

ప్రసాద్‌రెడ్డి తీసుకొచ్చిన లాభాలు కొందరికి నచ్చలేదా? వ్యాపారం పెరిగితే అక్రమ వసూళ్లకు అవకాశం ఉండదనే భావనతోనే ఆయన్ను పక్కన పెట్టారా? ఇప్పుడు మళ్లీ పాత వ్యవస్థను తీసుకువచ్చి, ఉన్నతాధికారులకు వాటాలు అందించే ప్రయత్నమేనా? అనే అనుమానాలు శాఖలోని సిబ్బందిలో గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం మొత్తం మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి వెళ్లకుండా జరిగిందా? అవినీతి లేని పర్యాటక శాఖను తీర్చిదిద్దాలనుకునే మంత్రి ఇలాంటి నిర్ణయాలను అంగీకరిస్తారా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**సమగ్ర విచారణ తప్పనిసరి**

"త్వరలోనే బకాయిలను చెల్లిస్తా" అన్న సామియల్ మాటలు ఈ స్థాయి అవకతవకలకు సరిపడిన సమాధానం కాదని విమర్శకులు అంటున్నారు. టూరిజం ప్లాజా టల్ హోటల్ వ్యవహారంపై బకాయిలు ఎలా ఏర్పడ్డాయి? నిధులు ఎవరి ఆదేశాలతో వినియోగించబడ్డాయి? లాభాల్లోకి తీసుకొచ్చిన అధికారిని ఎందుకు బదిలీ చేశారు? అన్న అంశాలపై స్వతంత్ర, సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పర్యాటక శాఖలోని ఈ అక్రమాల చక్రం మరింత విస్తరించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.



## హుస్నాబాద్ జిల్లలగడ్డ వద్ద
# అర్బన్ ఫారెస్ట్‌కు శంకుస్థాపన

– మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మన చౌరాస్తా : హుస్నాబాద్ జిల్లలగడ్డ వద్ద ప్రతిపాదిత అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, పిసీసీఎఫ్ సువర్ణ, సీసీఎఫ్ రామలింగం, డీఎఫ్ఓ పద్మజా రాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ స్వరూపతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎల్లమ్మ చెరువు, మహా సముద్రం గండి, రాయికల్ వాటర్ ఫాల్స్‌తో పాటు ఈ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంలో అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు చేయవచ్చని తమ దృష్టికి తీసుకువచ్చి సహకరించారని మంత్రి పేర్కొన్నారు. ఈ పార్క్ యువతకు ట్రెక్కింగ్‌కు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే దురాక్రమణలు జరగకుండా అడవులను రక్షించుకునేందుకు కూడా ఇది దోహదపడుతుందన్నారు. ఈ ప్రాంతానికి సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రతో ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని, ఇక్కడ ఉన్న సర్వాయి పాపన్న కోటల నేపథ్యంలో ఈ పార్క్‌కు "సర్వాయి పాపన్న అర్బన్ ఫారెస్ట్ పార్క్" అని పేరు పెడితే బాగుంటుందన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో రావడం ప్రారంభమైతే అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. క్రిటికల్ జోన్‌లకు ప్రాధాన్యతనిస్తూ ట్రెక్కింగ్ మార్గాలను అభివృద్ధి చేయాలని సూచించారు. భైరవ స్వామి గుడి, సర్వాయి పాపన్న కోటలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్ జోన్ ఏర్పాటు చేసి ఆటల సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే సమావేశాలు నిర్వహించుకునేలా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు అనుకూలమైన పర్యాటక కేంద్రంగా ఈ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను తీర్చిదిద్దాలని, ఇక్కడ పండ్ల మొక్కలు, ఇతర అవసరాలకు ఉపయోగపడే వృక్షాలను విస్తృతంగా నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# హుస్నాబాద్ కరీంనగర్‌లో ఉండాలనేది ప్రజల ఆకాంక్ష

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపిన విషయం ప్రజలకు తెలిసిందేనని, హుస్నాబాద్ కరీంనగర్ జిల్లాలో ఉండాలన్నదే ఇక్కడి ప్రజల ఆకాంక్ష అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్ శంకుస్థాపన అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి, అంబేద్కర్ సర్కిల్ వద్ద హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతామని బహిరంగంగా ప్రకటించిన విషయం గుర్తు చేశారు. స్థానిక శాసన సభ్యుడిగా ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. భవిష్యత్తులో సరిహద్దుల మార్పు లేదా జిల్లాల పునర్వ్యవస్థీకరణ శాస్త్రీయ పద్ధతుల్లో జరిగితే, హుస్నాబాద్‌ను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కరీంనగర్ జిల్లాలో కలపడం తప్పనిసరిగా జరుగుతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయమే ప్రభుత్వానికి మార్గదర్శకమని, హుస్నాబాద్ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



# విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ లక్ష్మణ్ తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపురం మండలం ముల్కనూర్ గ్రామ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో ఉన్న వివిధ విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రామ సర్పంచి జాలి ప్రమోద్ రెడ్డి నేతృత్వంలో ప్రజాబాట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా కాలనీలోని విద్యుత్ సరఫరా అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు,




లూజ్ వైర్లు, కొత్త కనెక్షన్లు, మీటర్ సంబంధిత ఇబ్బందులను స్థానికుల నుంచి ఏఈ లక్ష్మణ్ తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాబాట కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకోవడం వల్ల త్వరితగతిన పరిష్కారాలు సాధ్యమవుతాయని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచి జాలి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాడుగుల గోపి, విద్యుత్ శాఖ సిబ్బంది విజయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటాం

- అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారం వాస్తవం కాదు
- గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ల మంజూరు
- ఏకార్డుకైనా అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయి
- జీవో 252లో మార్పులు చేస్తాం..
- జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాం
- 14 జర్నలిస్టు సంఘాలతో మంత్రి పొంగులేటి మీటింగ్



**హైదరాబాద్, మన చౌరాస్తా :-** జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండదండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గాని, చిన్నబుచ్చాలనిగాని తమ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. జీవో 252 పై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమావేశంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని, జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈ సారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి వరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని పలుమార్లు సమావేశాలు నిర్వహించామని అంతేగాక దేశ వ్యాప్తంగా ఉన్ననియమ నిబంధనలను పరిశీలించడం జరిగిందని ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. తాము అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడం లేదని, కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను కచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీని వలన అసలైన పత్రికలు, పాత్రికేయలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన గాక జనాభా వారీగా అక్రిడిటేషన్‌లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని , దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామని, క్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

దేశంలోని తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేశామని తెలియజేశారు. సమావేశంలో పలువురు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, పాత్రికేయులకు బీమా తదితర అంశాలను ప్రస్తావించగా మంత్రి పొంగులేటి సావధానంగా వారికి సమాధానమిచ్చారు. ఇక జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించడం జరిగిందన్నారు. సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, ఐ అండ్ పిఆర్ కమిషనర్ సి.హెచ్ ప్రియాంక, సీపీఆర్‌వో జి.మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పట్టణాల అభివృద్ధి

- హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్‌పై బీజేపీజెండా ఎగరవేస్తాం..
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ పట్టణంలోని వైశ్యభవనలో బీజేపీ హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల సమావేశం బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జేఎస్ఆర్) హాజరై మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో హుస్నాబాద్ మునిసిపల్ కౌన్సిల్ పై బీజేపీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఒక్క సైనికుడిలా పని చేసి, పోటీ చేసే అభ్యర్థులకు సహకారంచి, గెలుపు లక్ష్యంగా ఊహ్య రచన చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో హుస్నాబాద్ పట్టణాన్ని మోడల్ టౌన్ గా తీర్చిదిద్దామని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పట్టణాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. 2029లో రాబోయేది బీజేపీ ప్రభుత్వమని, మునిసిపల్ పీఠం బీజేపీ పార్టీకి ఇస్తే హుస్నాబాద్ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు బోడిగే వెంకటేష్, వేల్పుల నాగార్జున్, ప్రధాన కార్యదర్శి గాదాసు రాంప్రసాద్, కార్యదర్శులు వడ్డెపల్లి లక్ష్మయ్య, అకోజు అరుణ్ కుమార్, బొప్పిశెట్టి సాయిరామ్, కోశాధికారి బుర్ర రాజు, శక్తి కేంద్ర ఇంచార్జీ నారోజు నరేష్, బీజేపీ సీనియర్ నాయకులు అడేపు లక్ష్మీ నారాయణ, బొనగిరి రవి, తోట సమ్మయ్య, కాయిత అరుణ్ రెడ్డి, వరియోగుల అనంతస్వామి, కాదాసు నర్సయ్య, నాయకులు ఇల్లందుల తిరుపతి, వేముల వెంకటరమణ, పోగుల శేఖర్, దొంతరబోయిన సాంబరాజు, దాసరి లక్ష్మణ్, దొంతరబోయిన సంతోష్, నాగరాజు, బాలయ్య, సావుల అక్షయ్, స్వామి , చెల్పూరి రాజేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దేవాలయ అతిథి గృహామా.. పార్టీ ఆఫీసా..!

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం అతిథి గృహాన్ని బీఆర్ఎస్ నాయకులు పార్టీ ఆఫీస్‌గా మార్చేయడంపై స్థానికంగా విమర్శలకు దారిసింది. అతిథి గృహం రాజకీయ నాయకులు వాడడం ఒక ఎత్తైతే, అతిథి గృహంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం గతంలో కొంతమేర జరిగిన ఇలా దేవాలయ అతిథి గృహానికి ఫ్లెక్సీలు కట్టడం ఇదే తొలిసారి. ఇలాంటి సంస్కృతిని పెంచి పోషించడం దేవాలయ పవిత్రతను దెబ్బతీస్తుంది అని, శనివారం రోజున కొమురవెల్లికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వచ్చినప్పుడు వారి అతిథి గృహంలో ఉన్న సమయంలో ఇలా ఫ్లెక్సీలు కట్టి పార్టీ నాయకులు ఫోటోలు దిగడంతో స్థానికంగా చర్చనీయం అయ్యింది. ఈ విషయంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి అని స్థానికులు కోరుతున్నారు.

# స్నేహితురాలి పిల్లలకి ఆర్థిక సాయం



**కొమురవెల్లి మన చౌరస్తా:** తమతో కలిసి చదువుకున్నందుకు స్నేహితురాలి పిల్లలకు ఆర్థిక సాయం అందించి, నలుగురికి స్ఫూర్తిగా నిలిచారు. మండల కేంద్రమైన కొమురవెల్లి ఉన్నత పాఠశాల 2006_07 ఎస్ఎస్సి బ్యాచ్ కు చెందిన స్నేహితులంతా కలిసి 40000 రూపాయలు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నరు. కొమరవెల్లి గ్రామానికి చెందిన సార్ల భాగ్య ఆకునూరు గ్రామానికి చెందిన కొయినేని మహేందర్ తో 16 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. పిల్లలు పుట్టిన రెండు మూడేళ్లకు తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. 14 సంవత్సరాల పిల్లలను తల్లి సాకుతూ వచ్చింది. వారం రోజుల క్రితం తల్లి కూడా బ్లడ్ క్యాన్సర్ తో మృతి చెందింది. దీంతో పిల్లలిద్దరూ అనాధలుగా మారారు. తోటి క్లాస్మేట్ సార్ల భాగ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న స్నేహితులు స్పందించారు. ఎవరికి తోచినంతవారు సాయం చేయడంతో 40,000 జమ కావడంతో స్నేహితులంతా కలిసి ఆకునూరు గ్రామానికి వెళ్లి స్నేహితురాలు పిల్లలకు అందజేశారు

# సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**మద్దూరు, మన చౌరాస్తా :** సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా శుక్ర వారం రోజున జిల్లా కేంద్రంలో ప్రారంభమైనటువంటి సీఎం కప్ టార్చ్ ర్యాలీ శని వారం రోజున మద్దూరు, దూల్మిట మండల కేంద్రానికి రావడం జరిగింది. సీఎం కప్ టార్చ్ ర్యాలీ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ యువజన విభాగం అధికారి జంగపల్లి వెంకట నరసయ్య మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జరగబోయే సీఎం కప్ క్రీడల్లో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్నటువంటి యువతీ యువకులు క్రీడా పోటీలలో పాల్గొనుటకు రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఆసిఫ్ గారు, మద్దూరు, దూల్మిట మండల గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు, మండల పంచాయతీ అధికారులు ,పంచాయతీ కార్యదర్శులు క్రీడాకారులు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి మెగా క్రికెట్ టోర్నమెంట్ ఈరోజు ముల్కనూర్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు, వంగర సబ్ ఇన్స్పెక్టర్ దివ్య, ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, వంగర సర్పంచ్ గజ్జల సృజన రమేష్, కొత్త కొండ టెంపుల్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్ ముత్యం అశోక్ యాదవ్, ఉప సర్పంచ్ కాసగోని మమతా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.మండల స్థాయిలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ లో క్రీడాకారులు, యువత మరియు క్రీడాభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ, యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్ లో విన్నర్, రన్నర్ ట్రోఫీలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు మరియు ప్లేయర్ల షీల్డ్‌లను పెద్ది వసంత మెమోరియల్ ట్రస్ట్ వారు స్పాన్సర్ చేయగా, ఇందుకు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్‌కు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, మొదటి విజేతకు నగదు బహుమతిని 14వ వార్డు మెంబర్ ముత్యం అశోక్ యాదవ్, రన్నర్ అప్ జట్టుకు నగదు బహుమతిని కొత్త కొండ టెంపుల్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా స్పాన్సర్ చేశారు. క్రీడాకారులకు రెండు క్రికెట్ బ్యాట్లను ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి అందించగా, ముల్కనూర్ క్రికెట్ జట్టుకు టీషర్ట్‌లను మూడవ వార్డు మెంబర్ గద్వాల ప్రశాంత్ బహుమతిగా అందించారు.



## హలో కళాకారుడా.. 20న చలో హైదరాబాద్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న హైదరాబాద్ గన్‌పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న పోరు దీక్షకు పిలుపునిస్తూ శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమం తెలంగాణ నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర కమిటీ వ్యవస్థాపకులు అణువోజు వెంకటేశం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన కళాకారులు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం 550 మందికి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చిందని, అయితే నిజమైన కళాకారులను పక్కనబెట్టి తాత్కాలికంగా బోగస్ కళాకారులకు ఉద్యోగాలు కల్పించిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాలుకు గజ్జ కట్టి, భుజాన గొంగడి వేసుకుని ఆటపాటలతో ఉద్యమాన్ని ముందుకు నడిపిన అనేక మంది నిజమైన కళాకారులకు ఇప్పటికీ ఉద్యోగాలు రాకపోవడం బాధాకరమని వారు తెలిపారు. కనీసం ప్రజాపాలనలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిజమైన కళాకారులను గుర్తించి వెయ్యి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈ నెల 20న హైదరాబాద్ గన్‌పార్క్ ధర్నా చౌక్ వద్ద పోరు దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారుల తరపున రాష్ట్ర నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులు అనోజ్ వెంకట్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో పాలేటి రాజు, గడ్డం సుధాకర్, వెన్నమల్ల వెంకటేష్, బుల్లెట్ వెంకన్న, అరుణోదయ కళాబృందం కళాకారులు నక్క సుమన్, నర్సింగరావు, పాలాటి రమేష్, ఆగస్టు కుమార్, గట్టయ్య రమేష్, రవి రాజు, సునీత, రమా తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో బోరు ఏర్పాటు

**భీమదేవరపల్లి, మన చౌరస్తా:** భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన అనంతరం కోరగానే భీమదేవరపల్లి ముదిరాజ్ సంఘం ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో బోరు వేయించి సహకరించినందుకు కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ముదిరాజ్ సంఘం కుల పెద్దలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పెద్దమ్మ తల్లి గుడి ఆవరణలో వేసిన బోరు పూర్తిస్థాయిలో విజయవంతం కావడంతో ముదిరాజ్ కుల సంఘ పెద్దలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బోరు గుడికి, భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, ఉపసర్పంచ్ శనిగరపు ఐలయ్య, వార్డు సభ్యులు లలిత, బొల్లంపల్లి శ్యామ్, వెంకటేశ్వర్లు, సాతురి విజయతో పాటు ముదిరాజ్ సంఘం కుల పెద్దలు పాల్గొన్నారు.





## రైతుల సొమ్ము తిరిగి ఇచ్చేయాలి

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** రైతులకు సీడ్ విత్తనాలు అందించే క్రమంలో కంపెనీ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్న బాధ్యులను గుర్తించి ఆ సొమ్ము రైతులకే తక్షణమే తిరిగి ఇవ్వాలని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు.శనివారం నాడు ములుకనూర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు మాడుగుల మొగిళి మాట్లాడుతూ సీడ్ కంపెనీ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతూ రైతులకు అండగా ఉంటుండగా కొంత మంది ఆర్గనైజర్లు కంపెనీ పేరు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.రైతులకు అధిక ధరకు విక్రయించిన అదనపు సొమ్మును రైతులకు తిరిగి ఇచ్చే విధంగా కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకోవలసిందిగా వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రకాష్, కాంతరావు, రాజ్కుమార్, పవన్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అశోక్



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ముల్కనూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్ కుమార్ ముఖర్జీ నియమించబడ్డారు. జాతర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జంబో కమిటీని ప్రకటించారు. అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం దక్కేలా ఈ జాతరకు కమిటీ నియమించడం విశేషం . డైరెక్టర్లు గా చెదర శంకర్, తాళ్ల పెల్లి రమేష్, ఎలబోయిన ఐలయ్య, గుండెల్ని చంద్రయ్య,మండల మహేందర్, బొల్లంపల్లి ప్రకాష్, దేవరాజు శంకర్, పూదరి కుమారస్వామి,గుర్రాల భాస్కర్ రెడ్డి, కూన దేవరాజ్, గోపగాని రాణి, బానోతు ఒద్దుల సంపత్,గుగులోతు రమేష్ అల్లంకుంట మల్లయ్య, సిద్ధమల్ల రాజమౌళి,మార్పు సంజీవరెడ్డి తదితరులతో కూడుకున్న జంబో కమిటీ ఏర్పాటు చేశారు.

## యువకుడికి అండగా నిలిచిన సర్పంచ్



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన గుర్రాల స్వామి ఎన్నో రోజులుగా రైనో ప్లాస్టీకి సంబంధించిన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని గమనించిన సర్పంచ్ తమకు ఇచ్చిన మాటకు కట్టుబడి, వైద్య సహాయం పేరుతో తన సొంత ఖర్చులతోనే అవసరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేయించారు. శస్త్రచికిత్స పూర్తయ్యిన అనంతరం,శనివారంరోజున సర్పంచ్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి స్వామిని పరామర్శించి, అతని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. యువకుడికి ధైర్యం చెప్పి, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, గ్రామ ప్రజల ఆరోగ్యం పట్ల సర్పంచ్ ఎంత బాధ్యతగా, శ్రద్ధగా వ్యవహరిస్తారో చూపించే మంచి ఉదాహరణ అని నిరూపించుకున్నారు. అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలబడే ఇలాంటి నాయకత్వం మన గ్రామానికి ఉండటం నిజంగా అదృష్టం అని అన్నారు.ఇలాంటి సేవాభావంతో ముందుకు సాగుతున్న సర్పంచ్‌కి గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**మద్దూరు మన చౌరాస్తా :** మండల కేంద్రంలో మర్మాముల ఆవాస గ్రామమైన బంజరకు చెందిన చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అసిఫ్ కథనం ప్రకారం.. బంజరకు చెందిన ఇండ్ల సిద్ధిరాములు (60) వ్యవసాయం చేసుకుంటూ జీవస్తున్నాడు. వ్యవసాయ, కుటుంబ పోషణలో అప్పులు చేయడంతో వాటిని తీర్చలేనని మనస్తాపానికి గురైన శని వారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సిద్ధిరాములు భార్య ఇండ్ల తారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి

- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలి
- జిల్లాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇచ్చినందుకు సీఎం కృతజ్ఞతలు
- 18 నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తాం..
- వరంగల్ ఎంపీ కడియం కావ్య




**జాఫర్‌గఢ్, మన చౌరాస్తా :** జాఫర్ గఢ్ మండలం కొనాయిచలం గ్రామ సమీపంలో నిర్మించబోతున్న యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, తెలంగాణ ఈడబ్ల్యుఐడీసి ఎండీ గణపతి రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ విద్యే సమాజాన్ని మార్చే శక్తి అని, ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భావనను ముందుకు తీసుకువచ్చారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న సంకల్పంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ పాఠశాలల ద్వారా ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, క్రీడా సౌకర్యాలు, లైబ్రరీలు, ప్రయోగశాలలు అందుబాటులోకి వస్తాయని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు రాష్ట్ర విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తాయని, రాబోయే తరాలకు ఇది వెలుగుల బాటగా మారుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు కడియం శ్రీహరిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, దానికంటే ఎక్కువగానే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం విద్య, వైద్య రంగాలకు కేరాఫ్‌గా నిలుస్తోందని ఎంపీ పేర్కొన్నారు. అదేవిధంగా స్టేషన్ ఘనపూర్ రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి, విద్యార్థులకు తోడ్పడే ఒక మంచి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా, గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు 200 కోట్ల రూపాయలతో అత్యాధునిక హంగులతో కార్పొరేట్ స్థాయిని మించే విధంగా మన విద్యా సంస్థలు బ్రహ్మాండంగా ఉండబోతున్నాయని, పిల్లలకు, ఉపాధ్యాయులకు కావలసిన అన్ని వసతులతో పాఠశాలను నిర్మాణం చేసుకోబోతున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు, తరగతి గదులు, వసతి గృహాలు, ల్యాబ్ లతో పాటు అన్ని రకాల వసతులు ఉంటాయని వెల్లడించారు. యాంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను 18నెలలలో పూర్తి చేసే విధంగా నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్ కు సూచించారు. 2027-28విద్యా సంవత్సరానికి నియోజకవర్గ ప్రజలకు బహుమతిగా అందించే విధంగా నిర్మాణ పూర్తి చేయాలని అన్నారు.

జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ యాంగ్ ఇండియా ఇన్నిటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలవబోతుందని తెలిపారు. జనగామ జిల్లాలో మొట్ట మొదటగా ఇంటిగ్రెటెడ్ పాఠశాల మంజూరు కావడం ఎమ్మెల్యే కడియం శ్రీహరితోనే సాధ్యం అయిందని అన్నారు. పేద కుటుంబాలను చెందిన ఎస్సి, ఎస్టీ, బిసి, మైనారిటీ పిల్లలు ఒకే చోట చదువుకునే అవకాశం ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలతో కలగనుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డీవో వెంకన్న, ఈడబ్ల్యుఐడీసి, విద్యా శాఖ అధికారులు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ఊరెళ్తున్నారా..
# జర ఇల్లు భద్రం!

- పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- సంక్రాంతి, మేడారం జాతర నేపథ్యంలో సీసీఎస్ కరపత్రాల విడుదల

**హనుమకొండ, మన చౌరాస్తా :** సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు, అలాగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు తరలి వెళ్లే భక్తుల నేపథ్యంలో ఖాళీగా ఉండే ఇండ్లలో చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సీసీఎస్ పోలీసులు రూపొందించిన కరపత్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా చోరీలు జరగకుండా ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన పలు భద్రతా సూచనలు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

**ఆధునిక భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి**

సెలవుల్లో బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్లు ఏర్పాటు చేసుకోవడం మంచిదని సూచించారు. ఇళ్లకు సెంట్రల్ లాక్ సిస్టమ్ లేదా డిజిటల్ లాకింగ్ సిస్టమ్ అమర్చుకోవాలని తెలిపారు. ఇంటి స్వీయ రక్షణ కోసం కనీసం 15 రోజుల స్టోరేజ్ కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఆన్‌లైన్ ద్వారా మొబైల్‌లో లైవ్‌గా పరిశీలించవచ్చని వివరించారు. సెక్యూరిటీ సర్వేలైన్స్‌కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**విలువైన వస్తువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ**

బీరువా తాళాలను బెడ్ క్రింద, బట్టల కింద దాచకుండా వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి లేదా వెంట తీసుకెళ్లాలని తెలిపారు. పక్కింటివారికి లేదా తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దని హెచ్చరించారు. ఇంటి తాళాలను తలుపుల దగ్గర, పూలకుండీలలో లేదా మ్యాట్స్ కింద దాచిపెట్టకూడదని స్పష్టం చేశారు.

**అనుమానం రాకుండా ఉండాలి**

వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్క్ చేయాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్‌లతో లాక్ వేయాలని సూచించారు. ఇంటి ముందు గేటుకు తాళం వేయకూడదని, అలా చేస్తే ఇంట్లో ఎవరు లేరని దొంగలు గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని సూచించారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలని, ఇంటి ముందు చెత్త, న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు పేరుకుపోకుండా చూడాలని తెలిపారు.

**పోలీసులకు సమాచారం ఇవ్వడం కీలకం**

తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామం, పట్టణం లేదా కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు. ఇంట్లో పనిచేసే వారి వివరాలను పోలీస్ స్టేషన్‌లో వెరిఫికేషన్ చేయించుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు, లొకేషన్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నామనే అప్డేట్లు పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్, సర్వెంట్‌లను నియమించుకునే సమయంలో నమ్మకమైన వ్యక్తులనే ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీలు సదయ్య, మధుసూదన్, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ధూల్మిట్ట, మన చౌరాస్తా :** ధూల్మిట్ట గ్రామ శివారులోని మోహితుమ్మెద వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని, మెదీని బుచ్చిరెడ్డి, ఇసుకుల్లా లింగంలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు మద్దూరు ఎస్సై అసిఫ్ తెలిపారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**